


'ఏ కథ మంచిది, ఏదికాదు' ఆ మంచి చెడ్డలు రచయితకన్నా పాఠకుడికే బాగా తెలుసు. అందుకే, పాఠకుడు యిష్టపడిన కథ కలకాలం నిలుస్తుంది.

రచయితకి నచ్చినకథే పాఠకుడూ మెచ్చుకుంటే అంతకన్న గొప్ప అనుభూతి మరొకటి ఉండదు. అటువంటి అనుభూతిని సంతరించుకున్న కథ 'అగ్గిపుల్ల చెప్పిన కథ'

తనదికాని ఏ నాగరికత మోజులో పడినా మనిషి పతనం కాక తప్పదు. అంతరాత్మముందు ఓడిపోకా తప్పదు.

'అగ్గిపుల్ల చెప్పిన కథ' మానవ జీవితానికి ఓ హెచ్చరిక.

మిత్రుడు శ్రీ ఆదూరి వెంకట సీతారామమూర్తి విషయాన్ని సున్నితంగానే కాదు నిశితంగా కూడా చెప్పగల మంచి రచయిత.

—శ్రీరాజ్.

అగ్గిపుల్ల వెలిగించాడు ధనరాజ్। గదంతా వెలుగు।

కొనవేళ్ళతో పుల్లను నిలువుగా పట్టుకున్నాడు.

దీపశిఖ నిశ్చలంగా వెలుగుతూంది. అగ్గిపుల్లను చూసి ఎంతైనా నేర్చుకోవచ్చు. అది చీకటిని పారద్రోలనూ గలదు. కట్టుకున్న ఇళ్ళను బుగ్గిచేసి జీవితాల్ని చీకటి మయమూ చేయగలదు. ఊహ తెలియని జీవిని ఆకొట్టుకోనూ గలదు. అన్నీ తెల్సి అనుభవాలలో కాగిన మనిషినీ తుద ముట్టించగలదు।

వేళ్ళు చురుక్కుమన్నాయి.

చీకటి! వంటరితనం!!

మనసులో యిముడ్చుకోలేని ఆలోచనలు!

కడుపులో బడబాగ్ని....

"అవునూ.... అగ్ని ఎందుకూ?"

'మనమింకా జీవించడం, అనుభవించడం నేర్చుకోవాలి!'

రెండురోజుల క్రితం సుమిత్ర అన్నమాటలు గుర్తుకొచ్చాయి.

సుమిత్ర!

సుమిత్రకు జీవితాన్నిచ్చింది తను. అనుభవాలనిచ్చింది తను.

నాగరిక సభ్యసమాజంలోకి తీసుకువెళ్ళింది తను.

నాలుగేళ్ళక్రితం తన జీవితంలోకి వచ్చింది సుమిత్ర. ఎంత అమాయకత్వం ఆ కళ్ళలో! ఎంత సున్నితత్వం ఆ మనసులో। ఆమె వచ్చిన సంవత్సరమే సిరిపాలు పొంగినట్లు పొంగింది.

ప్రమోషనొచ్చి హోదా పెరిగింది. జీతం పెరిగింది.

చక్కనిఇల్లు, షికారు పోవడానికో వాహనం. ఇంకేం కావాలి?

పిల్లలా? తొందరలేదన్నాడు తనే. సుమిత్రకూడా కాదనలేదు. ఫ్రెండ్స్‌తో పిక్నిక్‌లూ, పార్టీలూ.

సుమిత్రకు నలుగురిలోనూ మసలే పద్ధతులూ, మాట్లాడే తీరు తెన్నులూ.... అన్నీ.... అన్నీ తనే నేర్పేడు!

జీవితంలో అన్నీ అనుభవించాలి. అనుభవాలకోసం ఏ అలవాటునీ ద్వేషించక్కరలేదు. దానికి మనిషి బానిస కానంతవరకూ. ఇదీ తన తత్వం. తను గీసుకోలేదు. కానీ పరుధులున్నాయి!

ఇంటి ముందు ఆటో ఆగిన శబ్దమైతే కిటికీలోంచి చూశాడు. ఎవరో ఎదురింట్లోకి వెళ్తున్నారు.

తన అనుమానమేగాని సుమిత్ర యింత త్వరగా రాదు. ఆ పార్టీలో సుమిత్ర నాకరించేదేమిటో తనకు బాగా తెల్సు. అయస్కాంత శక్తి ల్లాంటి అలవాట్ల ఆకర్షణలవి!

కొత్త కొత్తే-కొత్తవన్నీ వింతలే. వింతలన్నీ అనుభవాలే. అనుభవంలేని జీవితం మరి సుమిత్ర దృష్టిలో నిరర్థకమే!

లేచి, మరో అగ్గిపుల్ల వెలిగించేడు.

మళ్ళీ గదిలో వెలుగు!

తను కాలిపోతూ వెలుగును చిమ్ముతోంది పుల్ల. కాలిపోవడం; తనను తాను నాశనం చేసుకోవడం జీవితాలకి పరిష్కారాలా?

ఆత్మహత్యే సమస్యలకి పరిష్కారం అని సూచించిన కథల్నీ, సినిమాల్నీ ద్వేషించేవాడు. జీవితంకోసం జీవించాలి. సమస్యా పరిష్కారానికి మార్గాలు వెదకాలి.

మరి యీ సంప్రదాయ వుచ్చుల్లో యిరుక్కున్న యీ జీవితాలకది సాధ్యమా?

వేళ్ళు చురుక్కుమన్నాయి- వెలుగుపోయింది.

సుమిత్ర ఎంతలా మారిపోయింది! ఆ మార్పుకు తనూ, తన స్నేహితులూ పూ ంరవిల్లి నాగరికతా కాదూ దోహదం చేసిందీ?

ఆ నాటి సంఘటన—

యాంబూనించి రజనీకాంత్ తిరిగివచ్చిన రోజది.

తనకింకా గుర్తే!....

ఆరేళ్ళ తర్వాత యాంబూనించి రజనీ దంపతులు ఇండియా వచ్చిన సందర్భంలో శివం తన యింట్లో పార్టీ ఏర్పాటు చేశాడు.

'యాంబూలో వున్నాడని చెప్పానే. వీడే ...రజనీకాంత్ తెలుసున్న వాళ్ళే పోల్చుకోలేనంతగా మార్చేశాడు వేషాన్ని" సుమిత్రకు పరిచయం చేశాడా రాత్రి -

ఆరడుగుల భారీవిగ్రహం, హిప్పీజుట్టు, సూటూ అదోలా అడ్గా వున్నాడు రజని.

'గ్లాడ్ గ్లాడ్ టుసీ...." అంటూ చెయ్యందించబోయాడు. అతనికా అవకాశం యివ్వకుండా నమస్కారంచేసి; "పోనీ మీరైనా కన్ఫర్మ్ చేసుకున్నాడా లేక పుట్టుమచ్చలు చూడాలా" అంది సుమిత్ర నవ్వుతూ.

ఫర్వాలేదే. మంచి సెన్సాఫ్ హ్యూమరుంది! అంటూ నల్లకళ్ళద్దాలు తీసి ఆమె కళ్ళలోకి చూశాడురజని. ఆ చూపుకు అసహించుకున్నా సభ్యతకోసం సర్దుకుంది సుమిత్ర.

మిసెస్ రజనీకాంత్ నీ, శివాన్నీ; మిసెస్ శివాన్నీ కూడా పరిచయం చేశాడు

మిసెస్ రజనిని అదేచూడ్డం. బాబ్డ్ హెయిరూ, స్లీవ్ లేస్ బ్లవుజూ ఒడ్డూపొడవుగా వుందామె. మిసెస్ శివం బెంగాలీ కట్టూబొట్టూలో అందంగా సింపిల్ గా వుంది.

కాస్సేపు పిచ్చాపాటీ అయ్యాక బ్రీఫ్ లోంచి 'సబ్జక్టు' తీసి బల్ల మీద పెట్టాడు రజని. బ్లూ రైబాండ్ జిన్ ఒకటి. జానీవాకర్ ఒకటి.

సారె పెళ్ళికూతుళ్ళలా మెరుస్తున్నాయి. కేబినెట్‌లోంచి అందమైన ఐదు యిటాలియన్. గాబ్లెట్స్‌ని తీసి టీపాయ్‌మీద పెట్టింది మిసెస్ శివం.

ఫారెన్ టేప్‌లోంచి పాప్ సంగీతం మంద్రంగా విన్పిస్తోంది. మూడు గాబ్లెట్లలో జిన్‌పోసి, చక్రాల్లా తరిగిన నిమ్మకాయ ముక్కలున్న డిష్‌ని అక్కడ రెడీచేశాడు శివం. రెండో బాటిల్ తెరిచి, మిగిలిన మూడు గాబ్లెట్లలోనూ విస్కీపోసి ఐస్‌క్యూబ్స్ వేశాడు రజని.

'చీర్స్'తో మొదలయ్యింది పార్టీ.

సుమిత్ర తనవంక అదోలా చూసింది. ఆ చూపులో భావం అర్థమయింది.

'మా సుమిత్ర బ్రాండువేరు—' అంటూలేచి, చనువుగా ఫ్రిజ్‌లోని థమ్స్అప్ డ్రింకును తీసుకొచ్చాడు.

అందరూ సుమిత్రవంక అదోలా చూసినా ఎవ్వరూ ఏం మాట్లాడలేదు.

రాత్రి తొమ్మిదయ్యేసరికి— జిన్‌సీసా సగం ఖాళీఅయింది— విస్కీ ముప్పాతిక అయిపోయింది.

'లేడీస్‌లాగ్ బిహైండ్" అరిచేడు రజని.

'మనం ముగ్గురం వాళ్ళద్దరేగా' అన్నాడు శివం సుమిత్రవంక చూస్తూ.

'యూ ఆరెలోన్ మిసెస్‌రాజ్ వై డోంట్యూకేప్ కంపెనీ విత్‌జ్! అన్నాడు రజనిలాలనగా.

పాప్ సంగీతం తారస్థాయినందుకుంది. రజనివంక దెబ్బతిన్న పులిలా చూశాడుతను. అతను కళ్ళతో నేనవ్వేడు. భయం భయంగా తన వంక చూసింది సుమిత్ర.

కంపెనీ యివ్వాల్సిందే' అంది మిసెస్ రజని ముద్దుముద్దుగా ముద్దుముద్దుగా.

అర్ధాంగి అన్నపుడు సుఖమూ, కష్టమూ, పుణ్యమూ, పాపమూ అన్నీ సమానంగా పంచుకోవాలి' అంది మిసెస్ శివం ఇంగ్లీషులో.

ఈసారి రజని లేచాడు. లేచి, ఖాళీ గాబ్లెట్‌లో జిన్‌పోసి, నిమ్మ చక్రంవేసి, "ఫర్ ది హెల్తు ఆఫ్ ఆలఫజ్!" అంటూ సుమిత్ర చేతి కందించేడు రజని.

అందరి చూపులూ ఆమెవంకే. తనవంక బ్లాంక్‌గా చూసింది సుమిత్ర.

'తీసోక్ సుమిత్రా. ఫర్వాలేదు. దాంట్లో ఏంలేదు' అన్నదితనేగా? అలా....నాగరికతా మేలి ముసుగులోకి సుమిత్రను బలవంతంగా....ఆ రాత్రి. ఆ తర్వాత నాలుగైదు రోజులూ తనేం మాట్లాడలేదు.

ఆరోజు తర్వాత మళ్ళెప్పుడూ తనా విషయంలో సుమిత్రను ప్రతి మాలలేదు. సుమిత్ర ప్రతిమారించుకోనూలేదు.

స్నేహాలూ, పద్ధతులూ, అలవాట్లూ, డబ్బుకీ, హోదాకీ, నాగరికతా సమాజానికీ తగ్గట్టుగానే మారేయి.

లేచి, అగ్గి పెట్టెను చేతిలోకి తీసుకుని తడుముకుంటూనే వంటిం ట్లోకి వెళ్ళేడు. స్టౌవ్‌ముందు నించొని, పాలగిన్నెను స్టౌవ్‌మీద పెట్టి ముచ్చటగా మూడో అగ్గిపుల్ల గీసేడు. సర్రున మండి వెలిగింది గాస్ వాసన ముకుపుటాలకి తగలడంతో పుల్లను బర్నర్ దగ్గరకు తీసుకువెళ్ళేడు.

గుప్పుమని అందుకుంది మంట.

*    *    *

వణుకుతున్న చేతుల్లో ఉత్తరాన్ని చేతిలోకి తీసుకుంది సుమిత్ర. వాక్యాలన్నీ గజిబిజిగా గడచిన సంఘటనల జ్ఞాపకాల దొంతరలుగా కళ్ళ ముందు అక్షరాలన్నీ కనుపించని సూదుల్లా; గునపాల్లా .... గుండె లోతుల్లోకి.

కట్టలు తెంచుకుని దుఃఖం పొంగింది సుమిత్రా.

ఎప్పుడూ ఖాళీగా వెర్రి ముఖం వేసుకుని వుండే మన బెడ్‌రూం లోని సీషెల్ యాష్‌ట్రేలో ఒక అగ్గిపుల్లను చూశాను. నిన్నకాదు. మొన్నా కాదు. నువ్వు బర్త్‌డే సెలిబ్రేట్ చేసుకున్న నాల్రోజులనాడు. ఆ పుల్ల ఇండియాలో తయారైందికాదు. జపాన్‌లో, అవునా? ఈ నాలుగురోజులూ దానికథే విన్నాను అగ్గిపుల్లకథ చెప్పగలదు సుమిత్రా! అగ్గిపుల్ల కథ చెప్పడమేంటని నవ్వేవు, గుర్తుందా?

అందుకే ...అందుకే సుమిత్రా....పరుగెత్తుకుంటూ బెడ్‌రూంలోకి వెళ్ళింది సుమిత్ర. మంచానికి తలవైపునున్న యాష్‌ట్రేలోకి ఆత్రంగా చూసింది. అందమైన ఆ యాష్‌ట్రేలో సగంకూడా కాలని జపాన్ అగ్గిపుల్ల!

గుండె వేగంగా కొట్టుకుంది.

కోపం, కసి, దుఃఖం ...అన్నీ ఒకేమారు కలిగాయి!

బలంగా యాష్‌ట్రేని నేలకేసి కొట్టి మంచంమీద బోర్లాపడింది. ఏడుపు, వెక్కిళ్ళూ ఎంతసేపలా ఏడ్చిందో!

ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది.

లేచేసరికి రాత్రి ఎనిమిదైంది. శరీరమంతా నీరసంతో నిస్తేజంగా వుంది. తలంతా భారంగా వుంది. కణతలు పగిలిపోతున్నాయి. ఎలాగో బాత్‌రూం దాకా వెళ్ళి ముఖం కడుక్కుని, ఫ్లాస్కులోని కాఫీ కప్పులో పోసుకుని తాగింది.

ఖాళీకప్పు పెడుతూ క్రిందికి చూసింది.

అందమైన సీషెల్ యాష్‌ట్రే ముక్కలు ముక్కలుగా.

తన జీవితాన్ని తనే పగలగొట్టుకుందా?

ఎన్ని కలలు కంది జీవితంమీద తను! చాలా కలలు నిజమయ్యాయి. మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన తను యీ అందమైన, ఖరీదైన జీవితాన్ననుభవించడం అదృష్టం కాదూ? కలల్లో తప్ప ఎంతమంది ఆడపిల్లలకు దొరుకుతుందీ జీవితం? మరి తను ఎలా చేజార్చుకుంది?

"మారాలి సుమిత్రా మనచుట్టూ వున్న సొసైటీనిబట్టి మనమూ మారాలి. గిరిగీసుకుని కట్టుబాట్ల వృత్తాల్లో వున్నంతకాలం ఎదుగుదల వుండదు. అనుభవం కావాలి ...కానీ ఆ అనుభవాలకోసం అలవాట్లు చేసుకుని వాటికి బానిసలు కాకూడదు. నన్ను చూడు."

నిజమే. రాజ్‌కి యే అలవాట్లూలేవు. "బానిసలం కానంతవరకూ ఏదైనా ఫర్వాలేదు ...ఫర్వాలేదు సుమిత్రా ఇట్స్ నథింగ్ ...దాంటోయేం లేదు అంటూనే తనను.. ?

దుఃఖం రాలేదుగాని గుండె బరువెక్కిందీమారు.

"ఈ స్నేహాలు అవీ నా కిష్టంలేదండీ"అన్న తనేనా ఇలాగైందీ? రజనీకాంత్, ఖన్నా, ఫర్తియాల్, వాసుదేవ్.... వీళ్ళంతా ఎవరు? వీళ్ళతో తనకెందుకు స్నేహం? వీళ్ళ భార్యలతో తనకేమిటి పని? వాళ్ళ అలవాట్లనూ, హాబీలనూ తను అలవర్చుకోకపోతే మాత్రమేం?

గదిలో కరంటు పోయింది. చీకటి! సుమిత్ర మనసులో ఏదో ముల్లు కలుక్కుమంది.

అరోజు ఇలాగే. రాత్రి ఎనిమిదవుతూంటే కరంటు పోయింది. కొవ్వొత్తులు వెలిగిస్తూంటే తలుపు చప్పుడైంది.

తలుపు తెరిస్తే ...ఎదురుగా వాసుదేవ్. ఏమనాలో తెలీక,నవ్వుతూ "రండి"అని సోఫావైపు నడిచింది.

"ఏం తీసుకుంటారు కాఫీయా, కూల్‌డ్రింకా?"
"డ్రింకే. కానీ రాజ్ ఏడీ?"
"సెకెండ్ షిఫ్టుగా. ఓవర్‌టైం కూడా వుందట."
"మైగాడ్-ఓటమే యీ రోజు!" అన్నాడు నవ్వుతూ.
"అంటే....?"

"ఏముందీ....కంపెనీకోసం వచ్చేను"అంటూ బ్రీఫ్ మూతతీసేదు అర్థమైంది సుమిత్రకు.

ఒక్క క్షణం ఇద్దరిమధ్యా నిశ్శబ్దం. "ఐ ప్రిఫర్ డ్రింక్. మీరేం అనుకోకపోతే మీ కంపెనీలో" అన్నాడు నవ్వుతూ.

ఆశ్చర్యంగా చూసింది. వంటరితనం....వింత కోరికా....తనంతకు ముందు కంపెనీ ఇవ్వ లేదనికాదు. కానీ యీ పరిస్థితుల్లో....

"కాదనండి. జస్ట్ కీప్ కంపెనీ నేనే పూర్తిచేస్తా...."

కాదనలేకపోయింది. ఫ్రిజ్‌లోంచి ఐస్ క్యూబ్సూ, గాజ్లెట్టూ తీసి అతనికోసం అమర్చి తను లిమ్కా తీసుకుంది.

ఏవేవో మాట్లాడుతూ రెండుపెగ్గులు బిగించేడు వాసుదేవ్. అతని మాటల్లో ఆకర్షణ వుంది, నాలెడ్జివుంది, అనుభవం వుంది. అనుభూతీ వుంది.

వాసుదేవ్ వృత్తిరీత్యా సైంటిఫిక్ ఆఫీసర్ అయినా ప్రవృత్తిచేత గొప్ప ఆర్టిస్టు. సంగీత ప్రియుడు

అంతలోనే లైట్లు వెలిగాయి.

"ప్లీజ్. ఇంతవెలుగా? ఆర్పెయ్యరూ!" అన్నాడు చిన్నపిల్లాడిలా.

ట్యూబులైటు తీసేసి డిమ్‌లైట్ వేసింది.

ప్లేట్లో చపాతీలూ, కూరా పట్టుకొచ్చి ఎదురుగా పెట్టి తనూ తీసుకుంది సుమిత్ర.

వాసుదేవ్ వాటివంకో మారు చూసి తన పనిలో తాను పడ్డాడు.

సీసా సగమూ, చిప్సు ప్లేటు పూర్తిగానూ ఖాళీ అయ్యాయి.

నౌ....ఇట్సుమై లాస్ట్ రిక్వెస్టు. ఒబ్లియిజ్ చేస్తారా"

ఏమిటన్నట్లు చూసింది సుమిత్ర.

"ఓన్లీ వన్ పెగ్ ఫర్ ది బెస్టు హెల్తాఫ్ మిస్టర్ రాజ్" అంటూ సీసాను సుమిత్ర వైపు తోశాడు. "నో" అంటూ నవ్వింది.

"ప్లీజ్ తప్పదు." అంటూ లేచి కేబిన్‌లోని గ్లాసందుకుని నింపి ఆమె చేతికందించాడు.

"....గుడ్ .. నౌ ఐ లైక్ యూ....యూ....సీమ్స్ టు బీ...." వాసుదేవ్ మాటలు లీలగా వినిపిస్తున్నాయి సుమిత్రకి. గాబ్లెట్ నిండుతూనే ఉంది ఎన్నడూ లేనంత మైకం ...రెప్పలువాలి....శరీరంమెక్కడో తేలిపోతూ....సోఫాలో వెనక్కు జారగిలబడింది.

"వాటేపెండ్....? ఏమైంది సుమిత్రగారూ...." అంటూ అదే సోఫాలో ఆమె ప్రక్కగా కూర్చొని, ఆమె నుదుటిమీద చెయ్యివేసి వేలితో చెమట బిందువుల్ని తుడిచాడు.

రెప్పలు విప్పి, కళ్ళ కొనల్నుంచి చూసిందతని వంక.

వాసుదేవ్ కళ్ళు మైకంగా మెరుస్తున్నాయి. అతని వేళ్ళు నుదుటిమీంచి బుగ్గలమీదికి జరిగి, నెమ్మది నెమ్మదిగా మొనదేలిన గడ్డంమీదికి ప్రాకుతున్నాయి.

....అతని వూపిరి చెంపలకు వెచ్చగా....మరబొమ్మలా అతని చెయ్యందుకుని లేచి నడిచేంది.

బెడ్‌పై మెత్తగా వాలి, బెదురు కళ్ళతో చూసిందతని మగసిరి వంక. పెదాలు అస్పష్టంగా వణికాయి.

సన్నని జలతరంగపు స్వరాలు మెల్లగా విన్పిస్తూంటే కనులు విప్పింది. జపాన్ మేక్ మ్యూజికల్ సిగార్ బాక్స్‌లోంచి సిగరెట్ తీసి, అందులోనే అందంగా పొందుపరచబడ్డ అగ్గిపుల్లతో వెలిగించాడు వాసుదేవ్.

ఆ స్వరాలు తనకెంత ఇష్టం?

"ఎంత బావుందో....ఇది నాకివ్వరూ?"అని అమాయకంగా అడిగేసింది ఆనాడు మొదటి పరిచయంలోనే. ధనరాజ్, మిసెస్ దేవ్‌కూడా ఆశ్చర్యపోయారు.

"ష్యూర్ ష్యూర్. మీకీ సిగరెట్ పెట్టె ఎందుకూ? మీకోసం కేషియో వి ఎల్.టోనే తెప్పిస్తాను అన్నాడు.

"అంటే....?"

"అది జపాన్ వారి అద్భుతమైన బుల్లిపెట్టె, వీణ, వయొలిన్. జలతరంగిణివంటి ఆరు రకాల వాయిద్యాలే కాక రికార్డు చేసి బంధించిన ఓ కమ్మని సంగీతం స్వరం, ఒక కేలిక్యు లేటరూ...." గొప్పగా చెప్పాడు.

*                    *                    *

అయితే....అయితే... తన కోరిక ఇలా....

పరుగెత్తుకెళ్ళి ఫోన్ డయల్ చేసింది.

"మిసెస్ రాజ్ స్పీకింగ్ ఇట్స్ నాటేన్ ఏక్సిడెంట్ ఇన్స్పెక్టర్, ఇటీజ్ బట్ ఎ ప్రి ప్లేన్డ్ కమిటెడ్ స్యూసైడ్....అవున్సార్, ధనరాజ్ గారు ప్రమాదవశాత్తు మరణించలేదు,అది కేవలంఆత్మహత్య. దానికి.... కారణం.... నేనే! నేనే సర్!"

గొంతులో వణుకు, కాళ్ళలోనీర్సం. నేలకొరిగిపోయింది.

(విజయ. జూలై 1983)